క్లుప్తంగా

వెంకన్నకు క్షీరాభిషేకం


స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు రామానుజాచార్యులు

పెందుర్తి : వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేషంగా క్షీరాభిషేకం జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఐ స్క్వేరర్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకున్న పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

పెందుర్తి: పీఎస్ఎఫ్ సంస్థ, ఐఈటీఈ స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో నగరంలోని గీతం యూనివర్సిటీలో నిర్వహించిన ఐ స్క్వేరర్ ఫెస్ట్‌లో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఐవోటీ ఎనేబుల్డ్ టెంపరేచర్ కండిషనింగ్ ప్రాజెక్ట్‌లో ఈఈఈ విద్యార్థులు టి.సాయి, పి.కృపరాజ్, ఈసీఈ విద్యార్థి హేమంత్ ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు.

20 మందికి క్యాంపస్ కొలువులు


ఎంపికైన విద్యార్థులతో విస్తం ప్రతినిధులు

పెందుర్తి: మండలంలోని పినగాడి విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 20 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హాబెల్ బెల్లోస్ కంపెనీలో ఆరుగురు ఇంజినీరింగ్, 14 మంది డిప్లమో విద్యార్థులకు కొలువులు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి. శివకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఇ.కిరణ్‌కుమార్, డెక్కన్ ఫైన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

7 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: మంత్రిపాలెం గ్రామానికి చెందిన బలిరెడ్డి రమణ 7 మద్యం సీసాలను తరలిస్తుండగా పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. మద్యం అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ ఎస్.బాలసూర్యారావు హెచ్చరించారు.

మండలంలో 59,065 మంది ఓటర్లు

సబ్బవరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు దాదాపు పూర్తి చేసినట్టు తహసీల్దార్ చలమయ్య తెలిపారు. మండలంలోని 24 పంచాయతీల పరిధిలో 59,065 మంది ఓటర్లు ఉన్నట్టు చెప్పారు. వీరిలో 30,929 మంది మహిళా ఓటర్లు, 28,929 మంది పురుష ఓటర్లు కాగా ఒక ట్రాన్స్ జెండర్ ఉన్నట్టు తెలిపారు. మండలంలో 68 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాల్లో తగిన వసతులు కల్పించినట్టు తెలిపారు.

కో–ఆపరేటివ్ సభ్యుల షేర్ క్యాపిటల్‌పై 6 శాతం వడ్డీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కో–ఆపరేటివ్ స్టోర్స్ సభ్యుల షేర్ క్యాపిటల్‌పై 6 శాతం వడ్డీ ఇవ్వనున్నామని కో–ఆపరేటివ్ స్టోర్స్ పాలకవర్గం ప్రకటించింది. స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన కో–ఆపరేటివ్ స్టోర్స్ 57వ మహాజన సభలో అధ్యక్షుడు బి.టి. జగదీశ్వరరావు మాట్లాడారు. స్టోర్స్ ప్రస్తుతం 14,283 సభ్యులతో రూ.కోటి 22 లక్షల మూలధనం కలిగి నెలకు రూ.7 కోట్లు వ్యాపారం చేస్తోందన్నారు. ఉక్కునగరం పాఠశాలల్లో యూనిఫాం, నోట్ బుక్స్ అమ్మకాలు చేయడానికి ఆయా పాఠశాలల యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి జి.నాగభూషణం, ఉపాధ్యక్షులు ఆకుల సూకరాజు, కోశాధికారి పి.రామకృష్ణారావు, డైరెక్టర్లు ఎ.వి.ఎస్.సత్యనారాయణ, డి.వి.నాగబాబు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
✆ 9885181097

పాలిటెక్నిక్ కళాశాలకు మహర్దశ

- రూ.8 కోట్లతో వసతులు
- ఆధునిక హంగులతో నూతన భవనం
- సాంకేతిక విద్యకు ప్రభుత్వం చేయూత
- క్యాంపస్ నుంచే మెరుగైన ఉపాధి అవకాశాలు


పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అదనపు భవనం



పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రధాన భవనం

పెందుర్తి: కళాశాల నుంచే నేరుగా కొలువులో చేరేందుకు టెక్నికల్ విద్య ఎంతగానో దోహదపడుతుంది. విద్యార్థులు ఎంచుకున్న బ్రాంచ్‌లో అత్యున్నత స్థాయిలో తర్ఫీదు పొందితే పరిశ్రమలు వారికి చక్కటి అవకాశాలతో ఆహ్వానం పలుకుతున్నాయి. అందుకే ప్రభుత్వం కూడా సాంకేతిక విద్యకు పెద్దపీట వేసింది. సకల వసతులు కల్పించింది. విద్యార్థుల నైపుణ్యానికి మరింత పదును పెట్టడానికి అవసరమైన భవనాలు, ల్యాబ్‌లు అందుబాటులోకి తెచ్చింది. దీంతో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు మహర్దశ పట్టింది.

క్యాంపస్ కొలువులు సాధించేలా..

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రస్తుతం ఉన్న ప్రధాన భవనానికి అదనంగా మరో భవన నిర్మాణానికి సాంకేతిక విద్యాశాఖ రూ.8 కోట్లు మంజూరు చేసింది. ఆ భవనాన్ని అదనపు హంగులతో నిర్మించారు. ప్రస్తుతం పూర్తిస్థాయి తరగతులు, ట్రైనింగ్ సెంటర్ ప్రారంభమై విద్యార్థులకు సాంకేతిక విద్య అందుతోంది. విద్యార్థులకు పలు రంగాల్లో అవసరమైన శిక్షణ ఇస్తూ మెరికల్లా తీర్చిదిద్దుతున్నారు.


కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంక్యుబేట్‌లో రోబోటిక్స్, మెకాట్రానిక్స్ హబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అరుదైన అవకాశం..స్కిల్ హబ్

పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలను రూ.రూ.9.7 కోట్లతో 22 గదులతో నిర్మించి 2018లో ప్రారంభించారు. సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ బ్రాంచ్‌లు ఉన్నాయి. ఒక్కో బ్రాంచ్‌కు 60 సీట్లు కేటాయించారు. అదనంగా బ్రాంచ్‌కు మరో 6 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే తొలినాళ్లల్లో సౌకర్యాల లేమితో కళాశాలలో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. అయితే 2020–21 విద్యా సంవత్సరం నుంచి కళాశాల దశ తిరిగింది. ప్రభుత్వం సాంకేతిక విద్యపై శ్రద్ధ పెట్టడంతో గతేడాది కళాశాలకు రూ.8 కోట్లు నిధులు వచ్చాయి. దీంతో ఇక్కడ 20 గదులతో అదనపు భవనం నిర్మాణం అందుబాటులోకి వచ్చింది.

అత్యాధునిక అస్త్రాలు

కళాశాలలో మరిన్ని సౌకర్యాల కల్పనకు ప్రైవేటు కంపెనీలు సీఎస్ఆర్ నిధులు సమకూర్చాయి. ఈ క్రమంలో మై యాక్సెస్ అనే ప్రైవేటు సంస్థ ముందుకు వచ్చి రూ.7 లక్షలతో ఇంక్యుబేట్‌లో రోబోటిక్స్, మెకానిక్స్ హబ్ ఏర్పాటు చేసింది. ఈ హబ్ ఆఫ్ రోబోట్రిక్స్, మెకానిక్స్ అత్యాధునిక ఇంజనీరింగ్స్ విభాగంలో నిష్ణాతులైన అధ్యాపకులు ఈ–కాడ్, ఎం.కాడ్, ఫ్యాబ్(3డి ప్రింటింగ్), రోబోటిక్స్, మెకాట్రానిక్స్, ఎంఎంఎ, టీఐజీ, ఎంఐజీ, మ్యాగ్ వంటి అధునాతన వెల్డింగ్‌లో మెలకువలను.. 3డి డిజైన్‌ను బోధిస్తున్నారు.


ఆటోక్యాడ్ వెర్షన్‌తో అధునాతన కంప్యూటర్ ల్యాబ్

- ఈ అత్యాధునిక ల్యాబ్‌లో కూల్ స్టఫ్ రూపకల్పన జరిగింది. విద్యార్థులు కంప్యూటర్‌ను ఉపయోగించి అద్భుతమైన డిజైన్లు రూపొందిస్తున్నారు. 3డీ ప్రింటింగ్ డిజైన్లు చేస్తున్నారు.
- ఇదే ల్యాబ్‌లో రోబోలను తయారు చేయడంపై పూర్తిస్థాయి శిక్షణ ఇస్తున్నారు. ఈ హైటెక్ బొమ్మల తయారీ విధానంపై నైపుణ్యం మెరుగుపరిచేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.
- మెకాట్రానిక్స్ అంటే మెకానిక్స్, ఎలక్ట్రానిక్స్ సమ్మేళనం. దీనిపై ఈ ల్యాబ్‌లో శిక్షణ ఇచ్చి యంత్రాలకు ప్రాణం పోసే నైపుణ్యాన్ని అందిస్తున్నారు.
- ప్రత్యేక పద్ధతులను ఉపయోగించి లోహ భాగాలను కలపడం(వెల్డింగ్)లో కూడా ఇక్కడే శిక్షణ ఇస్తున్నారు. బలమైన, మన్నిక ఎక్కువగా ఉండేందుకు దోహదపడే నిర్మాణాలను రూపొందించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుంది.
- నైపుణ్య శిక్షణ తర్వాత సూపర్ లాంగ్ ఇంటర్న్‌షిప్ తరహాలో ఆర్నెల్ల పాటు సంబంధిత పరిశ్రమల్లో శిక్షణ అందిస్తారు. విద్యార్థులు ఇక్కడ ప్రతిభ కనబరిస్తే ఆయా కంపెనీల్లో మెరుగైన వేతనాలతో ఉద్యోగం లభిస్తుంది.

గంగవరం పోర్టు పెద్ద మనసు

గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్, కోరమాండల్, ఎన్ఎస్‌టీఎల్ లాంటి సంస్థలను కళాశాల ప్రతినిధులు సంప్రదించారు. అందులో గంగవరం పోర్టు యాజమాన్యం రూ.37 లక్షలు సీఎస్ఆర్ నిధులు కేటాయించి పెద్ద మనసు చాటుకుంది. ఆయా నిధులతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా 200 స్టూళ్లు, డ్యూయెల్ డెస్క్ టేబుళ్లు తయారు చేయించారు. రెండు ల్యాబ్‌లలో 40 కంప్యూటర్లు ఏర్పాటు చేసి అందులో ఆటోక్యాడ్ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి సాంకేతిక విద్య వైపు అడుగులు వేసే విద్యార్థులకు పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల దిక్సూచిగా నిలవనుంది.

కల్యాణం.. కమనీయం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆలయ ప్రారంభోత్సవానికి పందిరిరాట


ఆలయ ప్రాంగణంలో పందిరి రాట వేసిన పూజారులు , మహిళలు

పరవాడ: రావాడ శివారు జల్లెలపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ పూజారి దంపతులు పందిరిరాట వేసి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వియ్యపు చిన్న, ఉత్సవ కమిటీ చైర్మన్ మేడిశెట్టి మాణిక్యం, ఎం.సోమునాయుడు, పి.అప్పారావు, కట్టా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పైప్‌లైన్ పనులు


జంగాలకాలనీ వద్ద పూర్తి కావచ్చిన వాటర్ ట్యాంకు


గొర్లివానిపాలెం జంక్షన్ సమీపంలో చురుగ్గా సాగుతున్న పైపులైన్ పనులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలో జలజీవన్ మిషన్‌లో భాగంగా పైపు లైన్ విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.పాత సబ్బవరం వాసులకు ఇంటింటికీ తాగునీరు అందించేందుకు సుమారు రూ.33 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఈ పనులు ప్రారంభించారు.సుమారు 2.4 కిలో మీటర్ల మేర వేయనున్న పైపులైన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. పాత సబ్బవరంలో సుమారు 220 కుటుంబాల వరకూ ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు ఈ పథకాన్ని ప్రారంభించారు. ఇప్పటికే దీనికి సంబంధించిన 40 వేల లీటర్ల రక్షిత మంచినీటి ట్యాంకు పనులు పూర్తికావచ్చాయి. కొద్ది రోజుల్లో పాత సబ్బవరం వాసులకు కుళాయిల ద్వారా మంచినీరు సరఫరా చేయనున్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో సబ్బవరం పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం సీఐ పిన్నంటి రమణ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. నిబంధనలు మీరి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పది పరీక్ష కేంద్రాల పరిశీలన

మండలంలోని పదోతరగతి పరీక్షలు నిర్వహిస్తున్న పలు పరీక్షా కేంద్రాలను సీఐ రమణ పరిశీలించారు.


వాహనాల తనిఖీలో సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ రమణ

సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రతిభా విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.

‘వీరుల త్యాగం.. వృథా కానివ్వం’

కూర్మన్నపాలెం: ‘విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు’ నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. నాటి వీరుల త్యాగాన్ని వృథా కానివ్వమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1135వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ఎందరో మహనీయులు ప్రాణాలను సైతం ధారపోశారన్నారు. ఎంతోమంది భూములను ధారాదత్తం చేశారన్నారు. నాటి త్యాగధనుల స్ఫూర్తితో, చెదరని సంకల్పంతో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ప్రధాని మోదీ ప్రకటించేవరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

వెంకన్న ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ధ్వజావరోహణం చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధానార్చకులు భావ నారాయణ స్వామి, హరి నారాయణ స్వామి నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి వేకువజామున ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామికి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన పుష్పయాగం, ఊంజల్ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.


ఊంజల్ సేవలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

ప్రగతి పథం

- రూ.2.50 కోట్లతో సీసీ డ్రెన్లు, కల్వర్టుల నిర్మాణం
- తొలగిన మురుగు కష్టాలు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు


వెన్నలపాలెంలో నిర్మించిన సీసీ డ్రైనేజీ


రాముడిగారి గ్రామంలో నిర్మించిన సీసీ కాలువ

పరవాడ: మండలంలోని పలు గ్రామాల వాసుల మురుగునీటి కష్టాలకు చెక్ పడింది. కాలువలు, కల్వర్టులు లేక వాడుక నీటితో పాటు వర్షపు నీరు నిలిచి పోయి ప్రజలు ఇబ్బంది పడేవారు. అలాంటి కష్టాలకు చెక్ చెప్పేలా ఆయా గ్రామాల్లో సీసీ కాలువలు, కల్వర్టులు నిర్మించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని సంతోష పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

మండలంలోని వెన్నలపాలెంలో మురుగు నీరు పోవడానికి కాలువ లేక ప్రజలు అవస్థలు పడేవారు. సమస్యను గుర్తించిన అధికారులు గ్రామంలో రెండు సీసీ కాలువల నిర్మాణానికి రూ.27 లక్షలు మంజూరు చేశారు. కాలువల నిర్మాణం పనులు పూర్తి మురుగునీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు.

- నాయుడుపాలెం శివారు కొండవానిపాలెంలో అంతంత మాత్రంగా ఉన్న మురుగునీటి వ్యవస్థను మెరుగుపర్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.9 లక్షలు వెచ్చించి సీసీ డ్రైనేజీ నిర్మించారు. ఇదే పంచాయతీ రాముడుగారి గ్రామంలో కాలువలు లేక ఏ మాత్రం వర్షం కురిసినా ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి వీధులన్నీ బురదమయంగా మారేవి. సిమ్మన్నగారి గ్రామం నుంచి వచ్చే మురుగునీరు కూడ ఈ గ్రామం వద్దే నిలిచిపోయేది. ఫలితంగా ప్రజలు నిత్యం పడరాని పాట్లు పడేవారు. సమస్యను గుర్తించిన అధికారులు రూ. 27 లక్షల వ్యయంతో సీసీ కాలువ నిర్మించారు. వర్షపు, మురుగు నీరు ఎప్పటికప్పుగా పోయే విధంగా చర్యలు తీసుకోవడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.
- కట్టవానిపాలెం ఎస్సీ కాలనీలో మురుగునీరు పోవడానికి శాశ్వత కాలువ లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. సమస్యను గుర్తించిన అధికారులు గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.7.50 లక్షలు వెచ్చించి సీసీ కాలువ నిర్మించి ప్రజలకు మురుగునీటి కష్టాల నుంచి విముక్తి కల్పించారు.
- మడకపాలెంలో రూ.9 లక్షలతో పక్కా సీసీ కాలువ నిర్మించి మురుగు నీటి ఇబ్బందులను తొలగించడంతో ఆ గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


కొండవానిపాలెంలో నిర్మించిన సీసీ కాలువ


మడకపాలెంలో నిర్మించిన సీసీ డ్రైనేజీ

50 సీసీ కాలువలు నిర్మించాం



మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు 50 సీసీ కాలువలు నిర్మించాం. వీటికి రూ.2.50 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. గ్రామాల్లో అధ్వానంగా మురుగునీటి వ్యవస్థను మెరుగుపర్చాం. ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– షణ్ముఖ, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పరవాడ

నీటితోనే మనుగడ సాధ్యం


ప్రసంగిస్తున్న సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: నీటితోనే భూమిపై జీవం మనుగడ సాధ్యపడుతుందని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు అన్నారు. ఏయూ సైకాలజీ విభాగంలో సిఫా ట్రస్ట్, సైకాలజీ విభాగం సంయుక్తంగా జలవనరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగోళంలో ఉన్న నీటిలో 97 శాతం సముద్రాలలో ఉండగా.. తాగడానికి ఉపయోగపడే జలం ఒక శాతం మాత్రమే ఉందన్నారు. పర్యావరణశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యుడు ఎ.జె.సాల్మన్‌రాజు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు నీటి లభ్యత ఎలా అనే దిశగా ఆలోచన చేసి ప్రణాళికతో పనిచేయడం, పరిరక్షించుకోవడం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, సిఫా ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ శశిప్రభ, సంస్థ ప్రతినిధులు రామలక్ష్మి, ప్రసాద్, సుబ్బలక్ష్మి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణను తెలిపే ప్లకార్డులు ప్రదర్శించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు

ఉక్కునగరం: రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ సీఐ వి. శ్రీనివాసరావు సూచించారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన స్టీల్‌ప్లాంట్ పరిధిలోని పలు కూడళ్ల వద్ద సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు అత్యంత చాకచక్యంగా ఇతరుల అకౌంట్ల నుంచి నగదును దోచుకుంటున్నారన్నారు. ప్రతీ రోజు కోట్లాది రూపాయలు సైబర్ నేరగాళ్ల జేబులోకి వెళ్తున్నాయన్నారు. సుమారు 20 రకాల ఆన్‌లైన్ దొంగతనాలు జరగుతున్నాయని వివరించారు. తెలియని యాప్‌లు, లింక్‌లను క్లిక్ చేయరాదని తెలిపారు. అనుమానం వచ్చిన ఫోన్ నంబర్లను ఎత్తవద్దని చెప్పారు. తెలియని వ్యక్తులకు ఆధార్ నంబర్లు, ఓటీపీలు, ఏటీఎం పిన్, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు వివరాలు తెలపరాదన్నారు. రివార్డులను ఆశగా చూపేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానం ఉన్న వ్యాపార లింక్‌లను తెరువరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
✆ 9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com